ప్రజాశక్తి
బుధవారం 27 డిసెంబర్ 2023
5
పార్వతీపురం మన్యం

రూ.9.53లక్షలకు వేలంపాట

ప్రజాశక్తి - శంబర

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు యాత్రికుల ద్వారా వచ్చే తలానీలాలు, కొబ్బరి చిప్పలు, దీపాలు, చీరలకు సంబంధించి వేలం నిర్వహించగా రూ.9.53లక్షలకు పాట ఖరారైనట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక చదును గుడివద్ద టెండర్ కం వేలం నిర్వహించారు. చీరలు, రవికలకు రూ.3,40,000, కొబ్బరి ముక్కలకు రూ.4,18,100, అమ్మవారి నామినేషన్ ఫోటోలకు రూ.88,500, దీపాలకు రూ.1,18,509కు ఆదాయం వచ్చింది. ఈ వేలం పాటకు పర్యవేక్షణ అధికారిగా బొబ్బిలి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజకుమారి, గ్రామ సర్పంచ్ సింహాచలమమ్మ, ఎంపిటిసి సభ్యులు తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ పూడిదాలి నాయుడు, వసంతుల భాస్కరరావు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, పాల్గొన్నారు.

పార్వతీపురంలో ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు : సాలూరులో మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి జి.వెంకటరమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణుతో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమ విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు పాదయాత్రలోనూ, అసెంబ్లీ లోను మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తామని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్‌ను వారం రోజుల్లోనే రద్దు చేస్తామని, హామీలు ఇచ్చారని అయితే ఆయన అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు కావస్తున్నా ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. మున్సిపల్ శాఖ మంత్రులకు, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శికి, సిడిఎం ఎ.కోటేశ్వరరావుకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చామని, నాలుగున్నరేళ్లలో వీరంతా పలుమార్లు కార్మిక సంఘాల నాయకులతో విడిగాను, అన్ని సంఘాలతో ఉమ్మడిగానూ చర్చలు జరిపినా ప్రయోజనం లేదని అన్నారు. కావున కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపట్టి తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకుంటామన్నారు. తక్షణమే మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ,గ్రాడ్యుటి, పెన్షన్ ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500 కనీస వేతనం ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాడ్యుటీ సగం జీతం పెన్షన్ గా ఇవ్వాలని, పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్ రద్దు చేయాలని, విలీన పంచాయతీల్లో కరోనాకు, వరదలకు కొత్తగా తీసుకున్న కార్మికులకు ఆప్కాస్ జీతాలు, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ నాయకులు నాగవంశం శంకర్రావు, చీపురుపల్లి సింహాచలం, మామిడి శివ, నాగవంశం మల్లేష్, బంగారు రవి, నాగవంశం నిర్మల, మంగళగిరి శ్రీను, మామిడి మజ్జి, పడాల ఆనంద్, సంతోష్, ఇప్పలమ్మ, ఎల్లమ్మ, గంగయ్యలు, పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. తొలుత మున్సిపల్ కార్యాలయం నుండి ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

పాలకొండ : మున్సిపల్ కాంటాక్ట్ కార్మికులను, ఆప్కాస్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మె శిబిరాన్ని ప్రారంభించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.భాస్కరరావు, సిహెచ్ సంజీవి మాట్లాడుతూ పాదయాత్ర అసెంబ్లీ సాక్షిగా జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పడాల వేణు, చింతల సురేష్, విమల, శ్రీదేవి, వి.ఆంజనేయులు, బి.విశ్వరావు, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మోకాళ్ల పై నిలబడి కార్మికుల నిరసన

సాలూరు: మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు ప్రారంభించిన సమ్మె సందర్భంగా నిరసన శిబిరం వద్ద కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పాదయాత్రలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మంత్రులు, అధికారులతో జరిపిన చర్చలు విఫలమయ్యాయని, గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మెకు వెళ్ళినట్లు చెప్పారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ నాయకులు టి.శంకరరావు, పోలరాజు, రాముడు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ టి.ఇందూ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మెలో పారిశుధ్య కార్మికులంతా పాల్గొన్నారు.

ఉలిక్కిపడ్డ ఉమ్మడి జిల్లా

- రెండు కరోనా కేసులు నమోదు
- భయాందోళనలో ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, డెంకాడ

పార్వతీపురం మన్యం జిల్లా, విజయనగరం జిల్లాలో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడిజిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జియమ్మవలస మండలం కుందరతిరువాడ పంచాయితీ నీచకవలసకు చెందిన మహిళకు కోవిడ్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె భర్త ఇటీవలే శబరిమల వెళ్లి వచ్చారు. తమ బంధువులకు ప్రసాదాలు పంచే క్రమంలో బైక్ యాక్సిడెంట్‌లో ఆమె గాయపడ్డారు. వైద్యం కోసం విశాఖ వెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కరోనా లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయగా కోవిడ్ జెఎన్1 కొత్త వేరియంట్ ఉన్నట్లు అనుమానించి నిర్ధారణ పరీక్షలు చేశారు. కరోనా ఉండడంతో వైద్యం అందిస్తున్నారు. ఆమె భర్తకు కూడా పరీక్షలు చేయగా కరోనా లక్షణాలు లేనట్లు గుర్తించారు.

డెంకాడ మండల కేంద్రానికి చెందిన బండారు నారాయణమ్మ (78) కరోనా బారిన పడింది. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె విజయనగరంలో ఓ ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ వైద్యుల సూచన మేరకు ఈనెల 12న విశాఖ కెజిహెచ్‌కు వెళ్లింది. పరీక్షలు చేసిన వైద్యులు కరోనాగా నిర్ధారించారని డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు తెలిపాపు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతుందని తెలిపారు.

కరోనా కేసు నేపథ్యంలో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా కొత్త వేరియంట్ ప్రచారం టీవీల్లో, పత్రికల్లో రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మాస్క్ తప్పనిసరి

కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందడంతో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి ప్రజల స్వగ్రామాలకు వస్తుంటారని, ఈ నేపథ్యంలో కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించాలని, శానిటైజర్ వినియోగించాలని కోరుతున్నారు.

వాలంటీర్ల సమ్మె

ఆడుదాం ఆంధ్ర బహిష్కరణ
ఎంపిడిఒలకు వినతులు

ప్రజాశక్తి-భోగాపురం, సీతానగరం

ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల గ్రామ సచివాలయ వాలంటీర్లు సమ్మెకు దిగారు. తమకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎంపిడిఒలకు సమ్మెనోటీసు అందజేశారు. భోగాపురం మండల కేంద్రంలో 35మంది వాలంటీర్లు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు. నెలకు రూ.18వేలు వేతనం ఇవ్వాలని కోరుతూ తామంతా సమ్మె చేస్తున్నట్లు ఎంపిడిఒ అప్పలనాయుడుకు నోటీసు అందజేశారు. తమకు కూడా సచివాలయ సిబ్బంది వలే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈనేపథ్యంలో పాఠశాల పీడీలతో క్రీడలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలో 35 పంచాయతీలకు చెందిన 314 మంది వాలంటీర్లు సమ్మెలోకి వెళ్లారు. మండల కేంద్రంలో వాలంటీర్లు ఎంపిడిఒకు సమ్మె నోటీసు అందజేశారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరించారు.

సీతానగరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వాలంటీర్లు

జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వార్షిక తనిఖీల్లో భాగంగా జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని ఎస్‌హెచ్ఒ రైటర్, కంప్యూటర్, సిబ్బంది గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపరిచిన గదులు, సీజ్ చేసిన వాహనాలను, స్టేషన్ పరిసరప్రాంతాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను, ఇతర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు . కేసుల్లో దర్యాప్తు జరుగుతున్న విధానం, పురోగతి గూర్చి ఆరా తీసి, సదరు కేసుల ఛేదింపునకు దోహదపడే దర్యాప్తు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. ప్రాధాన్యత కేసులను గుర్తించి స్పీడ్ ట్రయల్ ద్వారా నిందితులకు శిక్ష పడేలా చూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు జాగ్రత్తగా ఉండేలా రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించి వాహనతనిఖీలు నిర్వహించాలని సూచించారు. నాటు సారా తయారీ, అక్రమ రవాణా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్ఫోర్స్మెంట్ వర్క్ (డ్రంక్ అండ్ డ్రైవ్ ఓపెన్ డ్రింకింగ్) ఎక్కువగా నమోదుచేయాలని, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించాలని, రానున్న ఎన్నికల దృష్ట్యా గ్రామాలను సందర్శించి ముందస్తు సమాచారం సేకరించాలని, సమస్యాత్మక గ్రామాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం పోలీసు సిబ్బందితో మమేకమై వారి గ్రీవెన్సు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మురళీధర్, జియ్యమ్మవలస ఎస్ఐ అనీష్, సిసి సంతోష్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఎస్‌ఎస్‌ఎ ఉద్యోగుల సమ్మెకు ఎమ్మెల్సీల మద్దతు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తాము సంపూర్ణంగా మద్దతిస్తున్నట్లు ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. మంగళవారం పార్వతీపురంలో నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాట శిబిరం వద్దకు ఇరువురు ఎమ్మెల్సీలు హాజరై తమ సంఘీభావం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, మినిమం టైం స్కేల్ అమలు చేయడానికి కృషి చేయాలని, మహిళలకు చైల్డ్ కేర్ సెలవులు మంజూరు చేయాలని, పిఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు వారం రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చలకు సిద్ధపడకపోవడం దుర్మార్గమని, వెంటనే సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం నిరసన శిబిరం వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు, ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి నల్ల బాలకష్ణ, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ జెఎసి కన్వీనర్ బివి రమణ, వి ఇందిర, సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి నాయకులు పోలినాయుడు, లక్ష్మణరావు, ఈశ్వరరావు, రమేష్, భానుప్రకాష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ

పక్షం రోజులైనా అంగన్వాడీల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

ఖాళీ పళ్లాలు మోగిస్తూ నిరసన

పాలకొండలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పక్షం రోజులుగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమా అని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా ప్రాజెక్టు నాయకులు మర్రాపు అలివేలు, సాలూరు గౌరీమణి, సెక్టార్ నాయకులు బి.శాంతి, ఎం.గౌరి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకట రమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, బొత్స లక్ష్మి ఆధ్వర్యంలో 15వరోజు సమ్మెలో భాగంగా స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో ప్లేట్లు, పళ్లాలపై గరిటిలతో శబ్దం చేస్తూ వినూత్నంగా నినాదాలు ఇచ్చారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కారం చేయాలని నినదించారు. వీరి సమ్మెకు ఎపిటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు ధనుంజయ నాయుడు, ధనుంజయరావు, గోవిందరావు, సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు శివాని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సెక్టార్ నాయకులు టి.రాజేశ్వరి, బి.నీలవేణి, పార్వతి, బి.సునీత, ధర్మావతి, లలిత, పలువురు అంగన్వాడీలు పాల్గొన్నారు.

సాలూరు:తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమ్మెలో భాగంగా దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు కంచాలు మోగిస్తూ నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, యూనియన్ ప్రాజెక్టు బి.రాధ, వరలక్ష్మి,ఎ.నారాయణమ్మ, శశికళ, తిరుపతమ్మ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కంచాలు మోగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంట : మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె 15వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కంచాలు మోగించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టి ప్రభావతి, నాయకులు కోరాడ అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండల కేంద్రం సమ్మె శిబిరంలో ఖాళీ ప్లేట్‌లను మోగించి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అనంతరం సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, కృష్ణవేణి, లక్ష్మి, స్వాతి , కాత్యాయని , సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు టిడిపి సిపిఎం మద్దతు

కురుపాం : మండల కేంద్రంలో జరుగుతున్న అంగన్వాడీ పోరాటానికి మద్దతుగా మంగళవారం సమ్మె శిబిరం వద్దకు టిడిపి, సిపిఎం నాయకులు వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని, సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటానికి మద్దతు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ ఇన్‌ఛార్జి డొంకాడ రామకృష్ణ, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, జియ్యమ్మవలస టిడిపి అధ్యక్షులు పళ్ల రాంబాబు, కురుపాం నియోజకవర్గం తెలుగు రైతు అధ్యక్షులు గురరాన శ్రీరామ్మూర్తి, జియ్యమ్మ వలస మండల క్లస్టర్ జోగి భుజంగ నాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగ నాయుడు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా ప్లేట్లు పళ్లాలు శబ్దం చేస్తూ నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.రామలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు శైలజ, సత్యవతి, సునీత, లక్ష్మి, అరుణ, సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ, వై.రామారావు, పలు గ్రామాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఖాళీ పళ్లాలతో అంగన్వాడీలు నిరసన

మక్కువ : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 14 రోజులుగా అంగన్వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఖాళీ ప్లేట్లుతో చప్పుడు చేస్తూ తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అన్ని కేంద్రాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుమ్మ లక్ష్మీపురంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మెకు వివిధ సంఘాల నుంచి మద్దతు రోజురోజుకు పెరుగుతుంది. ఇందులో భాగంగానే టిడిపి, సిపిఐ, గిరిజన సంఘం, పి ఆర్ టి యు ఉపాధ్యాయ సంఘాలు సంఘీభావం తెలిపాయి. ఆయా సంఘాల సభ్యులు అంగన్వాడీలతో కలిసి సమ్మెలో కూర్చున్నారు. గత 15 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గపు చర్యని టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అధ్యక్షులు హరగోపాల్, సిపిఐ జిల్లా సహకార్యదర్శి టి.జీవ, ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షులు రొబ్బ లోవ రాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, ఎంపిటిసి మండంగి రమణ, అంగన్వాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి ఉన్నారు.

పాలకొండ : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.హిమ ప్రభ, కోశాధికారి బి.అమరవేణి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా చేపడుతున్న సమ్మెలో భాగంగా కోలాటం ఆడుతూ ఖాళీ కంచాలతో శబ్దాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకొండ, వీరఘట్టం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులు గొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకొండ ప్రాజెక్టు పరిధిలో గల అన్ని అంగన్వాడీ కేంద్రాల నుంచి సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాళీ కంచాలతో శబ్దాలు చేస్తూ కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ సమ్మె జరిగింది. సమ్మెకు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీతంపేట : సమ్మెలో భాగంగా ఖాళీ కంచాలు, గరిటెలతో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటియు) నాయకులు సంఘీభావం తెలిపారు. సమ్మెకు మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కొండగొర్రి భాస్కరరావు, సవర భాష వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సవర డొంబు, జిల్లా కార్యదర్శి సవర ఎల్లంగు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు, అంగన్వాడీ ప్రాజెక్టు కమిటీ కార్యదర్శి ఎ.దర్శమి తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్. ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి. సవర డొంబు, జిల్లా కార్యదర్శి సవర ఎల్లంగ్, సవర శ్రీను సంఘీభావం తెలిపారు.

కొమరాడ: మండల కేంద్రంలో అంగన్‌వాడీలు కోలాటం ఆడుతూ ఖాళీ కంచాలతో శబ్దాలు చేస్తూ సమ్మెలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజన సంఘ నాయకులు రామారావు, టిడిపి నాయకులు బిడ్డికి తమ్మయ్య, బత్తిలి శ్రీను, నూకరాజు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ, సెక్టార్ నాయకులు బి.అలివేలు, జ్యోతి, పద్మ, జయమ్మ, మల్లేశ్వరమ్మ, టిడిపి అరుకు పార్లమెంట్ రైతు ఉపాధ్యక్షులు బత్తిలి శ్రీనివాసరావు, మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల నుంచి సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కురుపాం : అంగన్‌వాడీలకు సంఘీభావంగా నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పార్వతీపురంలో ఖాళీ ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

సాలూరులో ఖాళీ ప్లేట్లు మోగిస్తున్న అంగన్‌వాడీలు

సీతానగరంలో ఖాళీ ప్లేట్లు మోగిస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఆరోగ్యానికి క్రీడలు దోహదం : కలెక్టర్

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రస్తుత జీవన శైలిలో మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు, వ్యాయామం అత్యంత ఆవశ్యకమని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను మండలంలోని నర్సిపురం జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్, వాలీ బాల్, కబడ్డీ, టెన్ని క్యాయిట్, ఖో ఖో పోటీలను కలెక్టర్, ఎమ్మెల్యే క్రీడాభిమానుల కేరింతల మధ్య ఆటలు ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా సంబరాలను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10వరకు 47 రోజుల పాటు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు అనంతరం కీడాకారులను పరిచయం చేసుకొని అభినందనలు తెలియజేశారు. తొలుత వివిధ విభాగాల క్రీడాకారులకు ప్రభుత్వం అందించిన క్రీడా సామాగ్రిని కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంగరమ్మ, అర్జున అవార్డు గ్రహీత ఎస్ జయరాం, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ జావెద్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర పోటీలను ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ఆదినారాయణ, ఎఎంసి చైర్మన్ హెచ్.మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి రాము, ఎంపిడిఒ కె.గీతాంజలి, స్పోర్ట్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, పలువురు పిడిలు, పిఇటిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : బ్యాడ్మింటెన్ పోటీలను ప్రారంభిస్తున్న పిఒ కల్పనాకుమారి

కురుపాం : జియమ్మవలస మండలం పెదమేరంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభించారు. అలాగే కురుపాంలోని శివన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిపి శెట్టి పద్మావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఆర్‌డిఒ ఎం.లావణ్య, డిపిఒ బి.సత్యనారాయణ, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, జిల్లా కోప్షన్ సభ్యులు షేక్ నిసార్, ఎంపిటిసి సభ్యులు వి.బంగారునాయుడు, స్వామి యోజులు, పిఎసిఎస్ చైర్మన్ కె.గౌరీశంకర్ సచివాలయ సిబ్బంది, వాలంటీరుల పాల్గొన్నారు.

కొమరాడ : ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలను జెడ్పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపిపి శెట్టి శ్యామల స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోనూ, మాదిలింగిలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు ఎంఇఒలు నారాయణస్వామి, తిరుపతి నాయుడు, ప్రెసిడెంట్ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణరావు, కొమరాడ సొసైటీ అధ్యక్షులు ఎన్.సూరప్ప నాయుడు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మక్కువ : మండలంలోని ములక్కాయ వలస మోడల్ పాఠశాల, ఎర్రసామంత వలస గిరిజన ఆశ్రమ పాఠశాల, మక్కువ, శంబర ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ విద్యార్థుల్లో క్రీడల పట్ల ఉన్న ఆసక్తి తద్వారా వారి నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందని జెడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు రంగునాయుడు, ఎంపిడిఒ సూర్యనారాయణ, తహశీల్దార్ సూర్యనారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఎంపిపి కె.దీనమయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట, గుమ్మలక్ష్మీపురం సర్పంచులు ఆర్.చైతన్య స్రవంతి, బి.గౌరీశంకర రావు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వైసిపి జిల్లా యువజన విభాగం కార్యదర్శి నిమ్మక గోపాల్, ఎంఇఒ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ యుగధర్, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, కిషోర్ సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' పోటీలు ప్రారంభం

జియ్యమ్మవలసలో... మండలంలోని రావాడ రామభద్రపురం, పెదమేరంగి, చిన మేరంగి, పిప్పల భద్ర, జియమ్మ వలస సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న క్రీడలకు 3వేల మంది పైగా యువత క్రీడలు ఆడేందుకు పేరు నమోదు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని ఎల్విన్ పేట, కేదారిపురం, పెద్దఖర్జ, దుడ్డు ఖల్లు, దొరజమ్ము, మండ, బాలేసు సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహిస్తున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాట్మెంటన్ డబుల్ క్రీడలను యువత ఆడనున్నారు.

సీతానగరం : మండలంలోని జోగింపేట అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఆర్‌డిఒ కె.హేమలత ప్రారంభించారు. అలాగే సీతానగరం, బూర్జ, నిడగల్లు, గాజులవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాల్లో ఆడుందాం ఆంధ్ర కార్యక్రమంలో ఆటలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్, తహశీల్దార్ ఎంవి రమణ, ఎంపిపి రవణమ్మ శ్రీరామనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, జోగింపేట సర్పంచ్ కళ్ళెంపూడి సింహాచలం, ఎంపిటిసిలు సురగాల గౌరీకిరణ్, బురిడీ కుసుమ సూర్యనారాయణ, ఎంఇఒలు జి.సూర్యదేవుడు, ఎం.వెంకట రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : మండలంలోని తోణాంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు ప్రారంభించారు. అలాగే మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో వైసిపి మండలాధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి సువ్వాడ గుణావతి, సర్పంచులు సువ్వాడ శశికళ, తొత్తడి నారాయణమ్మ, చీమల రాములమ్మ, ముచ్చల ఆదయ్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు రామకృష్ణ, వెంకట రమణ, మాధవరావు, కార్యదర్శులు, సచివాలయం, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భామిని : మండలంలో ఆడుదాం -ఆంధ్ర పోటీలను ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం ప్రారంభించారు. అలాగే బత్తిలిలో ఎంపిటిసి టింగ అన్నాజీరావు, సర్పంచ్ బిడ్డిక తమ్మారావు, బాలేరులో జెసిఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ ఆడుదాం -ఆంధ్ర పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరి, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, జెడ్‌పిటిసి బొడ్డేపల్లి ప్రసాదరావు, ఎంఇఒ భాస్కరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గెల్లంకి రమేష్, వైసిపి నాయకులు కొత్తకోట ఆంజనేయులు, చలపతి రావు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పాచిపెంట : ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిపి బి.ప్రమీల ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మీకాంత్, ఎఒ బివిజె పాత్రో, వైస్ ఎంపిపిలు మీసాల నారాయణ, కొల్లి రవీంద్ర, డోల బాబ్జీ, పి.వీరంనాయుడు, దండి ఏడుకొండలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

సాలూరు: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు ప్రారంభించారు. అలాగే వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో నమోదు చేసుకున్న క్రీడాకారులతో ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి.

వాలీబాల్ ఆడిన ఐటిడిఎ పిఒ

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ వాలీబాల్ ఆడి యువకులను ఉత్సాహపరిచారు. పిఎన్ బొడ్డవలస సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో నిర్వహించిన పోటీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, ఎంపిడిఒ పార్వతి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాలకొండ : మండలంలోని అట్టలిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ విక్రాంత్ బాబు, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపిలు బొమ్మాళి భాను, దమలపాటి వెంకటరమణనాయుడు, పాలకొండ వైస్ ఎంపిపిలు కణపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, ఎంఎంఎస్ అధ్యక్షులు కణుముల కల్పనా సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జివి కృష్ణారావు, ఎంపిడిఒ డొంక త్రినాధులు, నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు, వైస్ చైర్మన్ హనుమంతరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, బాసురు కాంతారావు, కిల్లారి మోహన్, తూముల లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం కరువు

కురుపాం : వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అధికారుల మధ్య సమన్వయ లోపం కనిపించింది. ఎంపిడిఒ, నగరపంచాయతీ కమిషనర్ మధ్య సమన్వయం కొరవడడంతో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయి. మీరు నిధులు ఖర్చు పెట్టాలంటే... మీరు నిధులు ఖర్చు పెట్టాలి అంటూ ఒకరిపై ఒకరు నిధుల సమీకరణ నెట్టివేయడంతో క్రీడాకారులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. తాగటానికి నీరు కూడా ఏర్పాటు చెయ్యకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పలు విమర్శలు వినిపించాయి.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. అలాగే చిదిమి, నర్సిపురం, వండువ, తలవరం, బిటివాడ, కంబరవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు, పిఇటిలు, సచివాలయ కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని రావివలసలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రైనీ డిఎస్‌పి అజిజ్, ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఎఒఎస్ అర్జున్, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, సర్పంచ్ బి.అప్పడు, వైసిపి నాయకులు రౌతు రామినాయుడు, కె.నరసింగరావు, పెద్దిరెడ్డి శ్రీనివాసరావునాయుడు, చందక వెంకటేష్, పాల్గొ న్నారు.

సీతానగరం : క్రీడాకారులకు క్రికెట్ బేట్‌ను అందజేస్తున్న ఆర్‌డిఒ హేమలత

28న విఆర్‌ఎల చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - కురుపాం

విఆర్‌ఎల సమస్యలపై ఈనెల 28న కలెక్టరేట్లో చేపడుతున్న ధర్నాకు జిల్లాలో గల విఆర్‌ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విజయవాడ అలంకార్ చౌరాస్తా వద్ద విఆర్‌ఎలు చేపట్టిన ధర్నా సభా స్థల వద్దకు వచ్చి తాను అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే విఆర్‌ఎల జీతాలు పెంచుతానని, వారి డిమాండ్లు పరిష్కరిస్తానని హామీ ఇచ్చి ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టి నేటికీ నాలుగున్నరేళ్లవుతున్నా ఆయన మాటలు నీటి మూటలగే మిగిలాయని అన్నారు. కావున విఆర్‌ఎల హక్కుల సాధనకు చేపడుతున్న ధర్నాకు పెద్ద ఎత్తున విఆర్‌ఎలు పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

గురుకుల పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో మల్లి గురుకుల పాఠశాలను ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు. బాగా చదవాలని సూచించారు. ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వాసుదేవ్ రావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టిడిపి విజయం ఖాయం : నందివాడ

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

రానున్న పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో అరకు పార్లమెంట్ పరిధిలో టిడిపి ఘన విజయం సాధించడం ఖాయమని అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి నందివాడ కష్ణబాబు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అరకు పార్లమెంట్ పరిధిలో గల కురుపాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, అరకు, రంపచోడవరం, పాడేరు నియోజకవర్గాల పరిధిలో టిడిపి బలంగా ఉందని ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. అంతేకాక అరకు పార్లమెంట్ అభ్యర్థి కూడా విజయం సాధించడం ఖాయమన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. కురుపాం నియోజకవర్గంలో టిడిపి పూర్తిస్థాయిలో బలోపేతంగా ఉందని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా టిడిపికి ఓటేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఐటిడిఎను రక్షించుకుందాంపై 31న సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఐటిడిఎ పరిరక్షణ కోసం ఈనెల 31న జరిగే గిరిజన సదస్సును జయప్రదం చేయాలని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక నేతలు పి.రంజిత్ కుమార్, పి.శ్రీనునాయుడు, టి.సాయిబాబు, ఎమ్.భాస్కరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఐటిడిఎ కార్యాలయంలో అడవితల్లి విగ్రహం ఎదుట కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ఐటిడిఎలు కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందన్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత పార్వతీపురం ఐటిడిఎకు, గిరిజనులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఐటిడిఎను రక్షించుకుందాం, గిరిజన సమస్యలను పరిష్కరించుకుందాం అంటూ ఈనెల 31న స్థానిక సామాజిక భవనంలో ఉదయం 10గంటలకు గిరిజన సదస్సు జరగనుందని, ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొత్తగా 207 పింఛన్లు మంజూరు

ప్రజాశక్తి - సీతానగరం

మండలానికి కొత్తగా 207 పింఛన్లు మంజూరయ్యావని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని గెడ్డలుప్పి, తామరకండి, బగ్గంవలస, దయానిధిపురం, జోగింపేట, సూరంపేట గ్రామాల్లో మంజూరైన పింఛన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆయా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలం గెడ్డసింగుపురానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు గొర్లి నారాయణరావు, అలమండ మాజీ సర్పంచ్ గంటేడ రామినాయుడు మృతి పార్టీకి తీరని లోటని టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ అన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బొంగు సురేష్ , మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురన శ్రీరామ్మూర్తి నాయుడు, డంగభద్ర సర్పంచ్ జోగి బుజింగారావు, నాయకులు రామారావు , రాంబాబు ఉన్నారు.

ఆశా కార్యకర్తల నిరసన

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలోని సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆశా కార్యకర్తలు నిరసన తెలిపారు. తమ సమస్యలతో కూడిన వినతి పత్రం తహశీల్దార్‌కు అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, సిఐటియు మండల అధ్యక్షులు వి.అమరవేణి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.గౌరీశ్వరి, రాధ రాణి, శాంతి, గౌతమి, శారద, లక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, జి జెస్సీ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని జగన్‌కు మొక్కుతున్న ఉపాధ్యాయులు

బకాయిల కోసం ఉపాధ్యాయుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు సుమారు రూ.18 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిందని, ఈ బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ పార్వతీపురం డివిజన్ శాఖ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి జగన్‌కు కొబ్బరి కాయలతో మొక్కు తీర్చుకున్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రి జంక్షన్లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నానుద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ఉద్యోగులను స్నేహితులుగా చూసుకుంటానన్నారని, ఇప్పుడేమో శత్రువులుగా చూస్తున్నారని అన్నారు. పిఆర్‌సి, డిఎ ఎరియర్స్, పిఎఫ్ డబ్బులు, ఎపిజిఎల్ఐ మొదలైనవి కలిపితే సుమారు రూ.18 వేల కోట్లు బకాయిలు చెల్లించాలని, అయితే ఇందుకు ప్రభుత్వం కిమ్మనకుండా ఉందని అన్నారు. జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ సంక్రాంతి లోపు ఈ బకాయిలు చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా జగన్ ఫొటోకు ఉపాధ్యాయులంతా మొక్కి కొబ్బరి కాయలు కొట్టి ఏదయ్యా నీదయ మా మీద లేదా అంటూ మొక్కు తీర్చుకు న్నారు. కార్యక్రమంలు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు కె.భాస్కరరావు, ఎన్.శ్రీరాములు, బి.కూర్మారావు, పి.వెంకటి నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జనసేన రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న మల్లేశ్వరరావు

అభివృద్ధి ప్రకటనలకే పరిమితం : జనసేన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వైసిపి చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ పేపర్లకే పరిమితమని జనసేన రాష్ట్ర కార్యదర్శి పి.చంద్రమోహన్ ఎద్దేవా చేశారు. మంగళవార స్థానిక జనసేన కార్యాలయంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో డంపింగ్ యార్డ్, తాగునీటి సమస్య అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ మాటిచ్చి తప్పారన్నారు. అలాగే ఇక్కడి ఎమ్మెల్యే కూడా కాలయాపన చేస్తూ గడిపేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించడం ఖామన్నారు. జనసేన - టిడిపి గెలుపు ఆపడం ఎవరితరం కాదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సీతానగరం మండల అధ్యక్షులు పాటి శ్రీను, పార్వతీపురం నాయకులు చందక అనిల్ కుమార్, నెయ్యిగాపుల సురేష్, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీ, మానేపల్లి ప్రవీణ్, భమిడిపాటి చైతన్య, కడగల శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన రాష్ట్ర కార్యదర్శిని కలిసిన మల్లేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం : జనసేన రాష్ట్ర కార్యదర్శి, ఆలిండియా తూర్పు కాపు సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌ను కురుపాం నియోజకవర్గ సమన్వయకర్త కద్రక మల్లేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, పార్టీ కార్యక్రమాలు నిర్వహణ, ప్రజాదరణ వంటి అంశాలను ఆయనకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా తూర్పు కాపు సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడేల శ్రీరామ్, నాయకులు కొనిశ రాజా, జనసేన టిడిపి నాయకులు శివకుమార్, సొంటెన రాజేష్ తదతరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

ప్రజాశక్తి - కొమరాడ

ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలం లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోటిపురం సమీపంలో విక్రంపురం నుంచి కోటిపాం రైస్ మిల్‌కు వెళ్తున్న ట్రాక్టర్ కల్వర్టు దగ్గర అదుపుతప్పి వెనుక ట్రక్కు భాగం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి

జామి: పల్నాడు జిల్లా కుందులూరుపాలెం గ్రామానికి చెందిన ఉషశ్రీ వెంకట ముత్తయ్య మండలంలోని కుమరాంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై ఎస్ఐ వీరబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాలు ప్రకారం... టార్పాన్లు అద్దెకు ఇస్తూ మండలంలోని ఆర్‌బీపురంలో ముత్తయ్య వుంటున్నాడు. మృతుడు సోమవారం రాత్రి పెద్ద పెద్ద కేకలు వేస్తూ ఉండడంతో బంధువులు అతడ్ని కుమరాంలో అట్టాడ వెళ్లే మార్గంలో చిన్న షాప్‌కు తీసుకెళ్ళి పెట్టారు. తెల్లవారే సరికి దుప్పటితో సెట్టర్‌కి ఉరి వేసుకున్నాడు. మృతుని తల్లి వేమలమ్మ ఫిర్యాదు చేయడంతో ఎస్.ఐ వీరబాబు కేసుదర్యాప్తు చేస్తున్నారు.

దుండగల దుశ్చర్య

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంటలో గల శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో గుర్తుతెలియని కొంతమంది దుండగులు సోమవారం అర్ధరాత్రి ఆలయంలో గల బృంగి, శృంగి, సోమనాథ్ లింగం, మహానంది విగ్రహాలను పాక్షికంగా ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్తుడు బుగత ఆనంద్ చూసి ఆలయ కమిటీ సభ్యులకు విషయం తెలియజేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు సాలూరు సిఐ ధనుంజయరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయం వద్ద గస్తీ నిర్వహించాలని ఎఎస్ఐ బి.ముసలయ్యను ఆదేశించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. విషయం తెలుసుకొని అదే సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న ఎంపిపి బి.ప్రమీల సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం సిఐతో మాట్లాడి దుండగల దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భ్రమరాంబిక ఆలయంలో విగ్రహాలు ధ్వంసం

ధ్వంసమైన విగ్రహం

మహిళా మేట్లకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉపాధి హామీలో మహిళా మేట్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జగదీష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో రిజిస్టర్ అయిన మహిళా మేట్లు అందరికీ నేటి నుంచి ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు మండలంలో 27 గ్రామ పంచాయతీలకు సంబంధించి 8 క్లస్టర్లుగా విభజించి మహిళా మేట్లకు కేటాయించిన గ్రామపంచాయతీ మెట్లను ఆయా సెంటర్లకు హాజరయ్యేలా సాంకేతిక, క్షేత్ర సహాయకులకు తెలియపర్చామని అన్నారు. ఈ మేరకు బాలేసు, చాపరాయి బిన్నిడి, రాయగడ జమ్మూ పంచాయతీ మేట్లకు ఈనెల 30న గొరడ పాఠశాలలోనూ, బీరుపాడు, చిన్న గీసాడ, గొయ్యపాక, జర్న పంచాయతీలకు ఎంపీపీ పాఠశాల, గద్రజోలలో, దుడ్డుఖల్లు, నెల్లికెక్కువ, వనకాబడి పంచాయతీలకు ఈనెల 29న దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో, అలాగే చెముడు గూడ, గుమ్మలక్ష్మీపురం, మండ, పి.ఆమిటి, ఎల్విన్ పేట పంచాయతీల మేట్లకు ఈనెల 29న వెలుగు కార్యాలయం గుమ్మలక్ష్మీపురంలో, ఇరిడి, పెద్దకర్జ, తాడికొండ పంచాయతీ మ్యాట్లకు ఈనెల 28న ఇరిడి ఎంపీపీ పాఠశాలలో, కొండవాడ, లక్క గూడ, లుంబేసు మేట్లకు ఈనెల 28న కొండవాడ ఎంపీపీ పాఠశాలలో, దుమ్మంగి, కుక్కిడి, రెల్ల పంచాయతీల మేట్లకు ఈనెల 27న దుమ్మంగి ఎంపీపీ పాఠశాలలో, కేదారిపురం, నోంద్రుకోన, వంగర మ్యాట్లకు ఈనెల 27న కేదారిపురం సచివాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆయా పంచాయతీల ఉపాధి హామీ మేట్లు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరవాలని ఆయన తెలిపారు.

ఇంటి స్థలం చూపి ఆదుకోండి : సిపిఎం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డుకు చెందిన వ్యక్తి దత్తి తిరుపతిరావు అనే వ్యక్తికి నాలుగేళ్లుగా ఇంటి పట్టా ఇచ్చినప్పటికీ అధికారులు స్థలం చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఇంటి స్థలం చూపించి అతడ్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు మంగళవారం బాధితునితో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019-20లో 18వ వార్డులో నివాసమున్న దత్త తిరుపతిరావు బొగ్గులు అమ్ముకొని జీవనం సాగిస్తుండగా, జగనన్న ఇళ్ల స్థలం కావాలని కోరగా మండలంలోని నర్సిపురంలో పట్టా ఇచ్చారని తెలిపారు. అయితే అంత దూరం నువ్వు వెళ్లలేవని పట్టా మార్చుతామని బోను ఆదినారాయణ, 18వ వార్డు సచివాలయ వాలంటీ రూప అతని వద్దనున్న పట్టా తీసుకువెళ్లి 8నెలలు ఉంచుకున్నారని తెలిపారు. కొన్నాళ్ల తర్వాత నిలదీసి అడిగితే వెంకంపేటలో ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి మోసగించారని అన్నారు. ఈ విషయంపై తహశీల్దారు, జిల్లా కలెక్టర్ చర్య తీసుకుని నిరుపేద, అంధుడైన తిరుపతిరావుకు ఇల్లు ఇవ్వాలని కోరారు.

రైతుకు పట్టాను అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - వీరఘట్టం

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నీలానగరంలో రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం మంగళరం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం అందుబాటులో రైతు భరోసా కేంద్రాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు వివిధ రకాల సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి డి.వెంకటరమణనాయుడు, సర్పంచు వావిలపల్లి పురుషోత్తమరావు, ఉపసర్పంచి ఎం.రాంబాబు, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, విఆర్ఒ నగేష్, వైసిపి సీనియర్ నాయకులు పాలవలస ధవలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.